BHARATH SAMACHAR DIGITAL

13, అక్టోబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

ఆవంచలో విషాదం.. రైతు మృతి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న తలారి ఆంజనేయులు (36) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆందోళన

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవంచ గ్రామానికి చెందిన ఆంజనేయులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వ్యవసాయ అవసరాలతో పాటు ట్రాక్టర్ నిర్వహణ ఖర్చుల కోసం కొంతకాలంగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో తరచూ ఆందోళన చెందేవాడు. తన బాధలను భార్య లావణ్యతో పంచుకునేవాడని పోలీసులు తెలిపారు.

అప్పుల గురించి ఆందోళన చెందవద్దని, క్రమంగా వాటిని తీర్చుకుందామని భార్య భరోసా ఇచ్చేదని పేర్కొన్నారు. సోమవారం రాత్రి కూడా ఆర్థిక ఇబ్బందుల గురించి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేయగా, భార్య అతనికి ధైర్యం చెప్పినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి.

తెల్లవారుజామున వెలుగులోకి వచ్చిన ఘటన

సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రపోయారు. అయితే, రాత్రి సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద ఆంజనేయులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు నిద్రలేచిన భార్య లావణ్యకు భర్త కనిపించకపోవడంతో బయట వెతికింది. ఈ క్రమంలో వాటర్ ట్యాంకు సమీపంలో ఆయన మృతదేహాన్ని గుర్తించింది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పోలీసుల విచారణ.. పోస్టుమార్టానికి మృతదేహం

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తన భర్త మృతిపై ఎవరి పట్ల ఎలాంటి అనుమానాలు లేవని భార్య లావణ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

భార్య, ఇద్దరు పిల్లలకు తీరని లోటు

ఆంజనేయులుకు భార్య లావణ్యతో పాటు కుమారుడు మనీ వర్ధన్ (13), కుమార్తె మధు చందన (11) ఉన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడంతో భార్య, పిల్లలకు తీరని లోటు ఏర్పడింది. ఈ ఘటనతో అవంచ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

© 2026 Bharath Samachar